# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత్ విజ్ఞానం, నైపుణ్యాలకు కేంద్రమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయవాడలో ప్రారంభించారు.**
3. **పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 కింద... 281 ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
4. **జీఎస్టీ రేట్లు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు.**

==========================

భారత్ విజ్ఞానం, నైపుణ్యాలకు కేంద్రమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం-సేతు పథకాన్ని ఈరోజు ప్రారంభించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు తప్పని సరిగా నెర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధికి పీఎం- సేతు పథకం తోడ్పడుతోందని ప్రధానమంత్రి చెబుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేసేందుకు రూపొందించిన 'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున, రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 90 వేల 669 మంది లబ్ధిదారులకు 436 కోట్ల రూపాయలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలుపుతూ....

..వాయిస్...30 సెకన్లు

---------------------------

ఆటో డ్రైవర్లు మహిళల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ మన్ననలు పొందాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి,

కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. గుంటూరులో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం 15 వేల రూపాయలు అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 కింద... 10 వేల 251 కోట్ల రూపాయలతో ప్రతిపాదించిన 281 ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న వివరాలు వెల్లడిస్తూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రపంచంలోని 5 రాజధానుల్లో అమరావతి ఒకటిగా ఉండాలని భావిస్తున్నట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. మలేషియా బృందం రాజధానిలో నిన్న పర్యటించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే రాజధానిలో 51 వేల కోట్ల రూపాయల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. 360 కిలోమీటర్ల మేర ట్రంకు రోడ్లు, 15 వందల కిలోమీటర్ల మేర లే అవుట్ రోడ్లు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు కలిపి మొత్తం 4 వేల ఇళ్లు వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

జీఎస్టీ రేట్లు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. నూతన జీఎస్టీ స్లాబులను అమలు చేస్తున్న తీరును పరిశీలించేందుకు ఒంగోలులోని పలు దుకాణాలను ఆయన నిన్న సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన జీఎస్టీ తగ్గించడం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ.. జీఎస్టీని నాలుగు శ్లాబుల నుంచి రెండు శ్లాబులకు తగ్గించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని తెలుపుతూ..

వాయిస్..34 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన కింద రాష్ట్రం నుంచి అల్లూరిసీతారామరాజు, శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేశారు. వీటికి నోడల్ అధికారులుగా నలుగురు ఐఏఎస్ అధికారులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో అల్లూరిసీతారామరాజు జిల్లాకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి అమిత్ సింగ్లా, శ్రీసత్యసాయి జిల్లాకు సహకార శాఖ సంయుక్త కార్యదర్శి సిద్దార్థ్ జైన్ నియమింపబడగా.. అనంతపురం జిల్లాకు పెట్రోలియం సహజవాయువుల శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ, అన్నమయ్య జిల్లాకు కార్పొరేట్ వ్యవహారాలశాఖ సంయుక్త కార్యదర్శి బాలమురుగన్‌ను నియమించినట్లు ఉత్తర్వులలో పేర్కొంది.

-----------------------------

రాష్ట్రంలో ఈ నెల 25వ తేదీ లోపు ఈ-పంట డిజిటల్ సర్వే పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు, సిబ్బందికి ఆ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. సామాజిక తనిఖీ, సవరణలు, మార్పులను ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తుది జాబితాను ఈనెల 31వ తేదీన విడుదల చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

-----------------------------

ఈ రోజు ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షకులుగా ఖ్యాతి గడించిన జంతు ప్రేమికులు, ఇటలీకి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ అసిసి 1226వ సంవత్సరం అక్టోబర్ 3వ తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన గౌరవార్థం ఆ మరుసటి రోజు... అక్టోబర్ 4వ తేదీన ఆ ప్రాంతంలో పండుగ వాతావరణంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా అక్టోబర్ 4వ తేదీన ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

-----------------------------

దీపావళి సందర్భంగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న బాణాసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేకుండా తయారీ,అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దుకాణాలు జనావాసాల నుంచి దూరంగా ఉండాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటల తర్వాత అమ్మకాలు నిషేధమని స్పష్టం చేశారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య, నైరుతి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ తెలియజేసింది.

=====================